క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



నోట్ పుస్తకాలు అందజేసిన ఉపాధ్యాయులు

దుద్యాల్: మండలంలోని అల్లిఖాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 50 మంది విద్యార్థులకు తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవా సహకారంతో బుధవారం నోట్ పుస్తకాలు, గణిత పరికాలు కలిగిన కంబాక్స్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థ పేద విద్యార్థులకు ఎంతగానో సహాయపడుతుందన్నారు. త్వరలో పాఠశాలలకు డిజిటల్ బోర్డులు, ల్యాబ్ పరికరాలు, క్రీడా పరికరాలు అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాములు , మల్లప్ప, అశోక్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు చూపిస్తున్న లబ్ధిదారులు

దుద్యాల్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు బుధవారం తహసీల్దార్ దానయ్య కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి చెక్కులు లబ్ధిదారులకు అందించామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజా, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, దుద్యాల్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, గౌరారం మాజీ సర్పంచ్ సీసీ వెంకటయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు



మాట్లాడుతున్న భీమరాజు

కొడంగల్ రూరల్ : ప్రభుత్వం ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రెవల్యూషన్ స్టూడెంట్స్ యూనియన్(ఆర్‌ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. పేదవిద్యార్థుల చదువుకు అందిస్తున్న ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడంలో జాప్యం చేయొద్దన్నారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులను చులకన చేసి మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న నేతలు

దోమ : వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. వేదపండితులు, మంత్రోచ్చరణలతో హోమం, మంత్ర స్థాపన పూజలు వైవభంగా నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ వాల్మీకి విగ్రహం స్థాపించడం సంతోషంగా ఉందన్నారు. రామాయణం రచించి ప్రపంచానికి తెలియజేసిన ఆదికవి వాల్మీకి మహర్షి అంటూ గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు చెక్కుల పంపిణీ

కుల్కచర్ల: నేడు చౌడాపూర్ మండలంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేయనున్నట్లు చౌడాపూర్ తహసీల్దార్ ప్రభులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం 2గంటలకు చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో 21మంది లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి హాజరుకానున్నారని తెలిపారు.

ఓపెన్ విద్యతో ప్రయోజనం

మధ్యలో చదువు మానేసిన, చదువుకోవాలనే పట్టుదల ఉన్నవారికి ప్రభుత్వం తెలంగాణ ఓపెన్ స్కూల్ ద్వారా విద్య అందిస్తున్నారు. పనులు చేసుకుంటూనే, సెలవు దినాల్లో విద్యను అభ్యసించవచ్చు. పది, ఇంటర్, డిగ్రీ విద్యను పూర్తి చేసుకోవచ్చని పలువురు విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఓపెన్ విద్య రెగ్యులర్ విద్యతో సమానంగా సర్టిఫికెట్ ప్రాధాన్యం ఇస్తున్నారు.

- టెన్త్, ఇంటర్, డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఆగస్టు 31వరకు డిగ్రీ, సెప్టెంబర్ 20 వరకు టెన్త్, ఇంటర్ దరఖాస్తుల స్వీకరణ



ఓపెన్ స్కూల్ తరగతులకు హాజరైన విద్యార్థులు(ఫైల్)

కొడంగల్ రూరల్ : పలు కారణాలతో చదువును మధ్యలోనే ఆపేసి.. మళ్లీ కొనసాగిద్దామనే సంకల్పం ఉన్నవారికి ఓపెన్ స్కూల్ ఎంతో ఉపయోగపడుతుందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్ సొసైటీ (టీఓఎస్‌ఎస్) ఆధ్వర్యంలో దూర విద్యా విధానాన్ని ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా పని చేసుకుంటూనే సెలవు దినాల్లో ఓపెన్ పాఠశాలల్లో తరగతులకు హాజరవుతూ చదువుకోవచ్చు. దీంతో వృత్తి పనులు చేసుకునేవారు, ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందాలనుకునేవారు ఓపెన్ స్కూల్ విద్య వైపు చూస్తున్నారు. ఇక్కడ చదువు పూర్తి చేసుకుంటే రెగ్యులర్‌కు సమానంగా సర్టిఫికెట్ ప్రాధాన్యం ఉండడంతో ఓపెన్ స్కూల్‌లో చదివేందుకు చాలా మంది ముందుకు వస్తున్నారు.

దరఖాస్తు విధానం..

పదో తరగతి చదివేందుకు ఎలాంటి విద్యార్హత అవసరం లేదు. 14ఏళ్లు నిండిన ఆపై వయస్సు కలిగినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయస్సు నిర్ధారణ ధ్రువపత్రం తహసీల్దార్ లేదా మున్సిపల్ అధికారులు జారీ చేసి ఉండాలి. మధ్యలో బడి మానేస్తే అప్పటి ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్(టీసీ), ఆధార్‌కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చు. పదవ తరగతి ఇంటర్మీడియేట్ 2024–25విద్యా సంవత్సరానికి సంబంధించి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా సెప్టెంబర్ 20వ తేదీ వరకు అడ్మిషన్ పొందేందుకు అవకాశం ఉందని కేంద్ర నిర్వాహకులు జెడ్పీహెచ్‌ఎస్(బి) హెచ్‌ఎం, కేంద్ర కో ఆర్డినేటర్ మురళీధర్ తెలిపారు. అభ్యాసకులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి రశీదును సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో దరఖాస్తుతో సమర్పించాలని పేర్కొంటున్నారు.

డిగ్రీ చదివేందుకు..

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024–25విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రథమ సంవత్సరంలో డిగ్రీ (బీఏ, బీ.కామ్, బీఎస్సీ)కోర్సుల్లో చేరేందుకు ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ రఫియాఖానమ్ తెలిపారు.

సమాన గుర్తింపు..

ఓపెన్ టెన్త్, ఇంటర్ మీడియట్, డిగ్రీ పూర్తి చేసుకున్నవారికి రెగ్యులర్ విద్యతో సమాన గుర్తింపు ఉంటుంది. ఉన్నత విద్య, పదోన్నతులు, ఉద్యోగాలు పొందదానికి చదువు మధ్యలో మానేసినవారికి, గృహిణులకు, వయోజనులకు ఎంతో ఉపయోకరంగా ఉంటుంది. చదువుకోవాలనే ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఓపెన్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్రం నిర్వాహకులు కోరుతున్నారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు, సెలవు దినాల్లో తరగతులు నిర్వహించడం, సబ్జెక్టుకు సంబంధించిన ఉపాధ్యాయులు, అధ్యాపకులతో బోధన, చదువుకోవాలనే పట్టుదల ఉన్నవారికి ఓపెన్ స్కూల్ ఎంతో ఉపయోగకరం ఉంటుంది.

కనీస ఫీజుతోనే ప్రవేశాలు



ఓపెన్ టెన్త్, ఇంటర్ స్కూల్ పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర కొడంగల్‌లో నిర్వహిస్తున్నాం. టెన్త్, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు సెప్టెంబర్ 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి.

–గోపీనాథ్, ఓపెన్ స్కూల్ అసిస్టెంట్

సద్వినియోగం చేసుకోవాలి



పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న డాక్టర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. డిగ్రీలో బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల్లో చేరేందుకు ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. 2015–16 నుంచి 2023–24విద్యా సంవత్సరం వరకు అడ్మిషన్ పొంది, ఫీజు చెల్లించనివారు ఆగస్టు 31వ తేదీ వరకు చెల్లిస్తూ తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించాలి.

–రఫియాఖానమ్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, కొడంగల్

కాలం చెల్లిన సరుకులతో సమస్యలు



కాలం చెల్లిన హెయిర్ ఆయిల్ డబ్బా

పరిగి: మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మున్సిపల్ కార్మికులకు నిత్యావసర సరుకులు అందిస్తోంది. పరిగి మున్సిపల్ కార్మికులకు అధికారులు నెలరోజుల క్రితం కాలం చెల్లిన సరుకులు పంపిణీ చేశారు. అవి వాడటం వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని పలువురు కార్మికులు వాపోతున్నారు. సరుకులతో పాటు హెయిర్ ఆయిల్‌ను వాడుతుండటంతో వెంట్రుకలు ఊడిపోవడం గమనించామన్నారు. దీంతో వాటిని పరిశీలించగా కాలం చెల్లినవిగా గుర్తించారు. మూడు నెలలు కావస్తుండటంతో సమస్యలు వస్తున్నాయని వాపోతున్నారు. గతంలో మంచి నాణ్యమైన సరుకులు వచ్చేవని, కాని ప్రస్తుతం నాణ్యత లేకుండా సరుకులు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ వివరణ కోరగా కాలం చెల్లిన వాటిని తీసుకుని వేరే సరుకులు ఇస్తామని తెలిపారు.

పోర్టల్‌లో నమోదు



వివరాలు నమోదు చేసుకుంటున్న ఏఓ


అనంతగిరి: రుణమాఫీకి కాని వారి (రేషన్ కార్డులు లేనివారు,) కుటుంబ సభ్యుల నిర్ధారణలో భాగంగా ఇంటింటికి తిరిగి రైతుల వివరాలను నమోదు చేసుకుంటున్నట్లు మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న తెలిపారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ మండలంలోని గొట్టిముక్కుల గ్రా మంలో రైతుల వివరాలను వ్యవసాయ శాఖ రుణమాఫీ పోర్టల్‌లో నమోదు చేశా రు. కార్యక్రమంలో ఏడీఏ స్వరూప, ఏఈఓ అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

30న ఇంటర్వ్యూలు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని బూర్గుపల్లి సమీపంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల (మోమిన్‌పేట)నందు పలు పోస్టుల ఖాళీలు భర్తీ చేయుటకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఉషాకిరణ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీటీ ఫిజికల్ సైన్స్, ఇంటర్మీడియట్ ఒకేషనల్ జియోథెరపీ, జేఎల్ ఫిజికల్ సైన్స్ పోస్టు ఉన్నాయన్నారు. అర్హులైన వారు 30న ఉ. 9గంటల నుంచి కొత్తగడి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అర్హులు సంబంధిత ధ్రువపత్రాలు తీసుకొని హాజరుకావాలన్నారు.

పెళ్లికి వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మహేశ్ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: బంధువుల పెళ్లికి వెళ్లి వస్తుండగా ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి షాద్‌నగర్‌లోని ఎలికట్ట చౌరస్తాలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం విఠలాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి మహేశ్ (40),సునీత భార్యభర్తలు ఇద్దరు ద్విచక్రవాహనంపై షాబాద్ మండలం హైతాబాద్ లోని వెంకటపూర్‌లో బంధువుల పెళ్లికి వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో ఎలికట్ట గ్రామ శివారులోని చౌరస్తా వద్ద ఆగి ఉన్న కంటైనర్‌ను బైక్ ఢీకొట్టింది. దీంతో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. సునీతకు తీవ్రంగా గాయాలవడంతో షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రశాంతంగా అంబురామేశ్వర జాతర

- ఏర్పాట్లను పర్యవేక్షించిన డీఎస్పీ బాలక్రిష్ణారెడ్డి



దేవాలయాన్ని సందర్శించిన డీఎస్పీ

పెద్దేముల్: కర్ణాటక సరిహద్దు పెద్దేముల్ మండలం తట్టెపల్లి శివారులో ఉన్న అంబురామేశ్వర దేవాలయంలో జాతర ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని తాండూరు డీఎస్పీ బాలక్రిష్ణారెడ్డి అన్నారు. బుధవారం అంబురామేశ్వర దేవాలయాన్ని డీఎస్పీ బాలక్రిష్ణారెడ్డి, ఎస్ఐ గిరి సందర్శించారు. శ్రావణమాసం చివరి సోమవారం జాతర ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శంకర్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు అన్నదానం, తాగునీటి వసతులు కల్పించడం జరుగుతుందన్నారు.తాండూరు, వికారాబాద్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలతో పాటు కర్ణాటక గ్రామాల నుంచి భక్తులు వస్తారని తెలిపారు. జాతరకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చుడాలన్నారు. జాతరకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పెద్దేముల్ ఎస్ఐ గిరిని ఆదేశించారు. జాతరకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆలయ కమిటీ సభ్యులను కోరారు.

ఖరీఫ్ సాగు బాగు

- 32వేల ఎకరాల్లో పంటలు
- సానుకూలంగా వర్షాలు
- కాతకు వచ్చిన పెసర, మినుము, గూడకు వచ్చిన పత్తి



పెద్దేముల్‌లో పత్తి పంట

పెద్దేముల్: మండల పరిధిలోని బండమీదిపల్లి, ఇందూరు, తట్టెపల్లి, నాగులపల్లి, మారేపల్లి, గాజీపూర్, గోపాల్‌పూర్, పెద్దేముల్ పలు గ్రామాల్లో ఖరీఫ్ పంటలు కళ కళలాడుతున్నాయి. విత్తనం నాటి నుంచి వర్షాలు అనుకూలంగా పడటంతో పంటలతో పాటు చెరువు, కుంటల్లో నీరుచేరి జలకళ సంతరించుకుంది. మండలంలోని 30 రెవెన్యూ గ్రామాల్లో సుమారు 41 వేల ఎకరాలకు పైగా సాగు భూమి ఉంది. ఇందులో సుమారు 32 వేల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ముఖ్యంగా పత్తి, కంది పంటలు అధికంగా సాగు చేశారని అన్నారు. పత్తి 12,500, కంది 9,320, పెసర, మినుము–4 వేల ఎకరాలు , మొక్కజొన్న, జొన్న, వరి, చెరుకు పంటలు సాగుచేశారని వివరించారు. కాని, పంటలకు మద్దతు ధర ఉంటే బాగుంటుందని రైతులు అంటున్నారు. పత్తి పంటలు చేతికి రాకముందే దళారులు రైతులను తప్పుదొవ పట్టిస్తున్నట్లు సమాచారం. దళారుల బెడద నుంచి కాపాడాలని ఆయా గ్రామాల రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



తట్టెపల్లిలో కోతకు వచ్చిన మినుము పంట

బాల్య వివాహాలు నేరం

- ఎస్ఐ శంకర్



బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ చేస్తున్న ఎస్ఐ

యాలాల: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం, ఇందుకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని యాలాల ఎస్ఐ శంకర్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని జుంటుపల్లిలో ఓ బాల్య వివాహాన్ని అడ్డుకొని కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను బాలిక కుటుంబ సభ్యులకు వివరించారు. బాల్య వివాహాన్ని ప్రోత్సహించే వ్యక్తులతో పాటు పురోహితుడిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు. చట్టరీత్యా 18 ఏళ్లు నిండిన అమ్మాయి, 21 ఏళ్లు నిండిన అబ్బాయిలు పెళ్లికి అర్హులన్నారు. మండలంలో ఎక్కడైనా బాల్య వివాహాలు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాండూరు టౌన్ : బీబీఏ చదువుతున్న విద్యార్థిని శివానికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ల్యాప్‌టాప్ అందజేసినట్లు క్లబ్ తాండూరు అధ్యక్షుడు రొంపల్లి సంతోష్ కుమార్ తెలిపారు. లయన్స్‌క్లబ్ సభ్యులు డాక్టర్ సంపత్‌కుమార్, మహ్మద్ బాసిత్ అలీలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారని అన్నారు. అలాంటి వారికి లయన్స్ క్లబ్ ఎల్లవేళలా అండగా నిలుస్తుందన్నారు. పేదలకు విద్య, వైద్య సహాయాన్ని అందించడంలో లయన్స్ క్లబ్ ముందు వరుసలో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా అడిషనల్ సెక్రటరీ సల్లా దామోదర్, జోన్ చైర్మన్ బసనప్ప, కార్యదర్శి వీరప్రసాద్, డాక్టర్ సంపత్ కుమార్, వినోద్ జైన్, బస్వరాజు, శివకుమార్, ఆర్డీ సోని పాల్గొన్నారు.

పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్



సమావేశంలో మాట్లాడుతున్న రాంచందర్

పరిగి: పార్టీ పటిష్ఠతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్‌యాదవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణ కేంద్రంలో పట్టణ, మండల బీజేపీ నాయకులతో సభ్యత్వ నమోదుపై వర్క్‌షాప్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారం దిశగా అడుగులు వేస్తుందన్నారు. అందుకు కార్యకర్తల కృషి ఎంతో అవసరమన్నారు. ప్రతి బూత్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నాయకులు చేపట్టాలని తెలిపారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలను ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి నరసింహా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరి: సీఐ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ నాగరాజు

అనంతగిరి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వికారాబాద్ సీఐ నాగరాజు సూచించారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేసి నంబర్ ప్లేట్ లేని వాహనాలు, సైలెన్సర్ మార్చి నడుపుతున్న వాహనదారులను ఆపి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పలువురు యువకులు సెలెన్సర్ మార్చి సౌండ్ పొల్యూషన్‌తో వాహనాలు నడపుతున్నారని మా దృష్టికి వచ్చిందన్నారు. మరికొందరు నంబర్‌ప్లేట్‌లు లేకుండా వాహనాలు నడుపుతున్నారని చెప్పారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీంతో పలువురు తమ వాహనాలకు నంబర్ ప్లేట్‌లు వేయించుకున్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలు పరిష్కరించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అనంతగిరి: మున్సిపల్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ పరిధిలోని 9,10, 16, 27, 31, 32 వార్డుల్లో మున్సిపల్ దర్బార్ కార్యక్రమంలో భాగంగా పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని కమిషనర్ జాకీర్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వార్డుల్లో పర్యటిస్తుండగా ప్రజలు తమ సమస్యలను స్వచ్ఛందంగా తెలియజేశారని అన్నారు.ఈ విషయంలో అధికారులు వెంటనే తగిన చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు యాష్కి శిరీష, వడ్ల నందు, డాక్టర్ రాజశేఖర్ విజయభాస్కర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

కాగితాల్లోనే నిధులు!

- పారిశుద్ధ్య పనులు సాగక అవస్థలు
- చేతులెత్తేసిన పంచాయతీ కార్మికులు
- నిధులు విడుదల చేయాలని హెచ్‌ఎంల విన్నపం



దేవర్‌ఫసల్‌వాద్ పాఠశాల

దౌల్తాబాద్: ప్రభుత్వ బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు స్కూల్ ఫెసిలిటి మెయింటెన్స్ పేరుతో ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు విద్యాశాఖ గత నెల 30న జీఓ విడుదల చేసింది. సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా విడుదలయ్యే కాంపోజిట్ స్కూల్ గ్రాంటుకు అదనంగా ఈ నిధులను అందజేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాని, ఇప్పటివరకు నిధులు విడుదల చేయలేదు. మండలంలో 45 ప్రాథమిక, 8 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలల్లో సుమారు 4500 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. బడుల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు సిబ్బంది లేరు. స్కావెంజర్లను గత ప్రభుత్వం తొలగించి, పారిశుద్ధ్య పనుల బాధ్యతను పంచాయతీ సిబ్బందికి అప్పగించారు. ఈ ప్రక్రియ ఎక్కడా సక్రమంగా అమలు కావడంలేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు స్కూల్ ఫెసిలిటి మెయింటెన్స్ గ్రాంటు కేటాయిస్తామని విద్యాశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యుల ఖాతాలో మూడు నెలల నిధులను జమ చేయబోతున్నామని వెల్లడించారు. ఇప్పటివరకు నిధులు జమకాలేదని కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు. ఈ జీఓ వచ్చినప్పటి నుంచి పారిశుద్ధ్య కార్మికులు పూర్తిగా చేతులెత్తేశారు. నిధులు ఖాతాలో జమ అయిన తర్వాతనే ముందుకు వెళ్లాలని అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, పాఠశాలల నిర్వాహకులు భావిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈఓ వెంకటయ్యను వివరణ కోరగా నిధులు రాని మాట వాస్తవమే. ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే పాఠశాలల్లో పారిశుద్ధ్యం పనులు చేపడతామని తెలిపారు.